సాక్షి కర్నూలు
ఆదివారం । 23 । జూలై । 2023



పత్తి ధర క్వింటా రూ.7,309

ఆదోని అర్బన్ : స్థానిక మార్కెట్ యార్డులో శనివారం పత్తి క్వింటా ధర రూ.7,309 పలికింది. రైతులు 505 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకొచ్చారు.



కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో 0.845 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



ఆసుపత్రుల్లో విజి'లెన్స్'

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో అందుతున్న సేవలపై ఆరా తీశారు. 8లో

ప్రశ్నల వర్షం.. నిలదీతల పర్వం

- వాడీవేడిగా జెడ్పీ సమావేశం
- అధికారుల తీరుపై ఎమ్మెల్యేల ఆగ్రహం
- కర్నూలు డీఈఓపై ఎమ్మెల్యే కాటసాని మండిపాటు
- ఎస్పీవై ఆగ్రోస్ ఫ్యాక్టరీ కాలుష్యంపై నిలదీత
- హాజరైన మంత్రులు అంజాద్‌బాషా, గుమ్మనూరు జయరాం
- స్థాయీ సంఘ సభ్యులుగా ముగ్గురు ఎమ్మెల్సీలు



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, చిత్రంలో కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన తదితరులు

కర్నూలు(అర్బన్): ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు.. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జెడ్పీ సమావేశ భవనంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా, రాష్ట్ర కార్మిక ఉపాధి, కల్పనా శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన, నంద్యాల డీఆర్‌ఓ పుల్లయ్య, ఎమ్మెల్సీలు డాక్టర్ ఎ. మధుసూదన్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, తొగురు ఆర్థర్, కాటసాని రామిరెడ్డి, జరదొడ్డి సుధాకర్, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, కేడీసీఎంఎస్ చైర్‌పర్సన్ శిరోమణి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు.

కేజీబీవీల అప్‌గ్రేడ్‌కు చర్యలు: డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

గ్రామీణ ప్రాంతాల్లో 10వ తరగతి పూర్తి చేసిన అనేక మంది బాలికలు ఇంటర్ విద్యను చదవలేక పోతున్నారని, వీరికి ఉన్నత విద్యను అందించేందుకు చర్యలు చేపట్టాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కర్నూలు జిల్లాలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయని, మహిళల్లో అక్షరాస్యత శాతం కూడా చాలా తక్కువగా ఉందని జిల్లా కలెక్టర్ డా.జీ సృజన చెప్పారు. వీటిని అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా మాట్లాడుతూ కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ ప్రవేశాలను అనుమతించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకుపోతామన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి అనేక సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కార్యక్రమంలో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. రెండు వేల జనాభా ఉన్న ప్రతి గ్రామానికి ఒక రైతుభరోసా కేంద్రం ఏర్పాటైందని, అన్నదాతలు ఎక్కడికీ వెళ్లకుండా ఊర్లోనే అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో ఏర్పాటైన ఆర్‌బీకేలను ఇతర రాష్ట్రాల ప్రతినిధులు, కేంద్రంలోని మంత్రులు, విదేశీ ప్రతినిధులు సందర్శించి రైతులకు అందుతున్న సేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు.

- మీరు తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో అనేక పాఠశాలలు ఉపాధ్యాయులు లేక మూతబడుతున్నాయి. ముస్లింల జనాభా అధికంగా ఉన్న బనగానపల్లెలో ఉర్దూ టీచర్‌ను లేకుండా చేశారు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చెయ్యవా ? చేతకాకుంటే ఉద్యోగం మానేసి వెళ్లిపో ... అంటూ జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డిపై బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రోస్ ఫ్యాక్టరీ నుంచి కలుషిత రసాయనాలు విడుదల కావడం వల్ల కుందూ నదీ పరివాహక ప్రాంతాల్లోని చేపలన్ని చనిపోయాయి. ఈ నదీ తీరం వెంట దాదాపు ఆరు రక్షిత మంచి నీటి పథకాలు ఉన్నాయి. ఈ నీరు తాగడం వల్ల ప్రజలకు దురద వస్తోంది. ఇటీవల చేపలు చనిపోయాయి ... నేడో, రేపో మనుషులు చనిపోతే కూడా పట్టించుకోరా? అంటూ పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫ్యాక్టరీని ఎప్పుడైనా తనిఖీ చేశారా ? చేపలు చనిపోయిన సంఘటనపై ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఈ సంఘటనకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఒక కమిటీని విచారణకు ఆదేశించారని డీఆర్‌ఓ పుల్లయ్య సమాధానమిచ్చారు. ఈ అంశంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా స్పందిస్తూ నిర్ణీత కాలవ్యవధిలోగా విచారణ పూర్తి చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎంఈడీ చేస్తున్న సమయంలో జీతం తీసుకోరాదని ప్రభుత్వ నిబంధన ఉన్నా, ఏడాది పాటు రూ.12 లక్షలు జీతం తీసుకొని ప్రభుత్వానికి నష్టం కలిగించారని పలు మార్లు డీఈఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ఆరోపించారు. అలాగే స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఒకరు తన సొంత వ్యాపారాలు చూసుకుంటూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్నారు. ఈ విషయాలపై విచారణ జరపాలని ఆయన జిల్లా కలెక్టర్ డా.జీ సృజనకు ఫిర్యాదు చేశారు.



సమావేశానికి హాజరైన ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, తొగురు ఆర్థర్, సుధాకర్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదన్, రామచంద్రారెడ్డి తదితరులు

ఎవరేమన్నారంటే ...

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే..

- ఉర్దూ విశ్వవిద్యాలయానికి సంబంధించిన భవన నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. అలాగే నీటి పారుదలకు సంబంధించి త్వరలోనే ఐఏబీ సమావేశాన్ని నిర్వహిస్తాం. – ఎస్‌బీ అంజాద్‌బాషా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి
- సీ బెళగల్ మండలంలోని తుంగభద్ర నది నుంచి ఇసుక రవాణా వల్ల దెబ్బతిన్న రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలి. – గుమ్మనూరు జయరాం, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి
- టీడీపీ హయాంలో కోడుమూరు నియోజకవర్గంలో పలు ప్రభుత్వ పాఠశాలలు మూతపడగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు – నేడు కార్యక్రమంలో ఆయా పాఠశాలలన్నీ పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి. – జరదొడ్డి సుధాకర్, కోడుమూరు ఎమ్మెల్యే
- నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి పట్టాలు ఇచ్చారు కానీ, స్థలాలు నేటికి చూపించలేదు. ఈ విషయంపై గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – తొగురు ఆర్థర్, నందికొట్కూరు ఎమ్మెల్యే
- వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి చేపట్టిన పనులకు బిల్లులు ఎప్పుడు మంజూరు చేస్తారు ? – కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే
- ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సమగ్ర రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలి. జెడ్పీకి ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇతరత్రా గ్రాంట్లు నీటి పథకాల నిర్వహణకే ఖర్చవుతోంది. – కాటసాని రామిరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే
- నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ లేకుండా చూడండి. కుడా పరిధిలోకి వచ్చిన గ్రామాల్లోని ప్రజలకు గృహాలు ఎప్పుడు మంజూరు చేస్తారు? – శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే

స్థాయీ సంఘ సభ్యులుగా ముగ్గురు ఎమ్మెల్సీల ఎంపిక

నూతనంగా ఎంపికైన ముగ్గురు ఎమ్మెల్సీలను జెడ్పీ స్థాయి సంఘాల్లో సభ్యులుగా ఎంపిక చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన డాక్టర్ ఎ. మధుసూదన్‌ను 2వ స్థాయీ సంఘానికి, ఎమ్మెల్యేల కోటాలో ఎంపికైన ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాను 4వ స్థాయీ సంఘానికి, మరో ఎమ్మెల్సీ టీ తిరుమలనాయుడును 6వ స్థాయీ సంఘానికి సభ్యులుగా ఎంపిక చేశారు.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో



హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి వరద మరింత పెరిగింది. శుక్రవారం ఇన్‌ఫ్లో 13,340 క్యూసెక్కులు ఉండగా శనివారం ఉదయానికి 34,071 క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రం సమయానికి 41,572 క్యూసెక్కుల నీరు జలశయానికి వస్తున్నాయి. జలాశయంలో 1,633 అడుగులకు గాను 1,595.88 అడుగుల మట్టం నమోదైంది. పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.649 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఒక రోజు వ్యవధిలో 3 టీఎంసీల నీరు జలాశయానికి చేరింది.

బీఎల్‌ఓ, వలంటీర్ సస్పెన్షన్

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల విధులకు సంబంధించి ఎలాంటి పనుల్లో గ్రామ, వార్డు వలంటీర్లు పాల్గొనరాదని కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి గ్రామ సచివాలయం-1 పరిధిలోని బీఎల్‌ఓ కొత్త రామకృష్ణ వలంటీర్ మహ్మద్ రఫీతో కలసి ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు. విషయం మీడియాలో రావడంతో కలెక్టర్ స్పందించి విచారణ జరిపారు. ఈ మేరకు వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రేపటి నుంచి ఏపీఈఏపీ సెట్ కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ఏపీఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు రేపటి(సోమవారం)నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలుకానుంది. ఈ మేరకు జి.పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ(బి.తాండ్రపాడు) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవిఎస్ఎస్ఎన్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెల 3వ తేదీ వరకు కౌన్సెలింగ్ ఫీజు చెల్లించి https://cets.apsche.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200 ఫీజులు చెల్లించాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి సర్టిఫికెట్లను జి.పుల్లారెడ్డి పాలిటెక్నిక్ కాలేజీలో ఆగస్టు 4వ తేదీ వరకు వెరిఫికేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 3 నుంచి 8వ తేదీ వరకు కాలేజీ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని, 9 నుంచి ఆప్షన్స్ మార్చుకోవచ్చునని, 12న కాలేజీలను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. స్పెషల్ క్యాటగిరీ(ఎన్‌సీసీ, పీహెచ్, క్యాప్,స్పోర్ట్స్)వారికి సర్టిఫికెట్ల పరిశీలన విజయవాడ బెంజ్ సర్కిల్లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 30 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ఉంటుందన్నారు.

నేడు శ్రీరాముడి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

- వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా



విగ్రహ నమూనా

మంత్రాలయం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో 108 అడుగుల పంచలోహ శ్రీరాముడి విగ్రహ నిర్మాణ ఏర్పాట్లకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదివారం ఉదయం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఇందు కోసం మంత్రాలయంలోని ఎమ్మిగనూరు రోడ్డులో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు, మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, బీజేపీ నాయకుడు పురుషోత్తమరెడ్డి ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు శ్రీరామ్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎంపీ శ్రీధర్, కె.రాములు వెల్లడించారు. ఈ ప్రాజెక్టును రూ.250 కోట్ల అంచనాతో చేపట్టామన్నారు. విగ్రహంతో పాటు తొమ్మిది ఆలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. విగ్రహం ఇప్పటికే దాదాపు పూర్తికావచ్చిందని, పీఠాధిపతి ఆశీర్వాదంతో త్వరలోనే పనులుపూర్తి చేస్తామన్నారు.

ఊపిరి పోసిన వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండటంతో పంటలకు ఊపిరి పోసినట్లయింది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు కర్నూలు జిల్లాలో 20, నంద్యాల జిల్లాలో 22 మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా కొత్తపల్లిలో 27.8 మి.మీ వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లా మొత్తం మీద సగటున 9.0, నంద్యాల జిల్లాలో 7.6 మి.మీ వర్షం కురిసింది. కాగా శనివారం మధ్యాహ్నం నుంచి జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఈ నెల చివరిలోపు అన్ని ఎర్ర, నల్ల నేలల్లో పత్తి, కంది, ఆముదం, పొద్దుతిరుగుడు, కొర్ర, మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు.

ప్రాంతం	వర్షపాతం(మి.మీ)
గోనెగండ్ల	25.4
నందికొట్కూరు	24.2
జూపాడుబంగ్లా	24.2
మిడుతూరు	24.2
ఆత్మకూరు	23.4
కల్లూరు	20.2
కర్నూలు అర్బన్	18.8
కోడుమూరు	16.6
కౌతాళం	15.4

రైతుల సేవలో తరిస్తా

- జిల్లా సహకార కేంద్రబ్యాంకు నూతన చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): కేడీసీసీ బ్యాంకు ద్వారా రైతుల సేవలో తరిస్తానని.. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని నూతన చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తెలిపారు. శనివారం ఆమె ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. బ్యాంకు సీఈఓ పి.రామాంజనేయులు చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయమనోహరి మాట్లాడుతూ ఎస్వీ కుటుంబానికి, కేడీసీసీబీకి మంచి సంబంధాలు ఉన్నాయని.. తన మామ ఎస్వీ సుబ్బారెడ్డి రాజకీయ జీవితం కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గానే మొదలైందన్నారు. ఆ తర్వాత ఆయన ఆప్కాబ్ చైర్మన్‌గా, ఎమ్మెల్యే, మంత్రి స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. తన రాజకీయ ఎదుగుదల ఇక్కడి నుంచే మొదలు కావడం సంతోషాన్ని ఇస్తోందన్నారు. నాడు–నేడు తరహాలో జిల్లా సహకార కేంద్రబ్యాంకును అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించారని, సమర్థవంతంగా సేవలు అందించి ఇటు ప్రభుత్వానికి, అటు బ్యాంకుకు మంచి పేరు తీసుకొస్తామన్నారు.

పుస్తకం.. రెండింతల సంబరం

- 12.05 లక్షల రెండో సెమిస్టర్ పుస్తకాలు ఒకే రోజు పంపిణీ
- ఆనందం వ్యక్తం చేసిన విద్యార్థులు



నందవరం మండలం ఇబ్రహీంపురం పాఠశాలలో కొత్త పుస్తకాలను చూపిస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: విద్యావ్యవస్థలో సరికొత్త రికార్డు నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు రెండో సెమిస్టర్ పుస్తకాలను దాదాపు విద్యార్థులందరికీ అందజేశారు. దీంతో అంతటా హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్, కస్తూర్బా, ఏపీ మోడల్ స్కూళ్లు 2,777 ఉండగా.. వీటిలో 4.11 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ అన్ని రకాల పాఠ్య పుస్తకాలు కలిపి 51.72 లక్షలు అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారులు ఇండెంట్ పెట్టారు. ఇందులో మొదటి సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు 39,66,794 విద్యార్థులకు పంపిణీ చేశారు. శనివారం రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్కులు 12,05,227 పంపిణీకి శ్రీకారం చుట్టారు. మొదటి రోజునే అత్యధిక శాతం పంపిణీ చేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

మొట్టమొదటి సారి

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యా సంవత్సరం ముగుస్తున్నా పాఠ్య పుస్తకాలు అందేవి కాదు. ప్రస్తుతం ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. విద్యా సంవత్సరం ప్రారంభమైన రోజునే పిల్లల చేతుల్లో పుస్తకాలు పెట్టాలనే సీఎం వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలను విద్యాశాఖ పకడ్బందీగా అమలు చేస్తోంది. గత నెలలో పాఠశాలలు పునఃప్రారంభమైన రోజునే స్కూల్‌కు వచ్చిన విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పుస్తకాలు అందించారు. శనివారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లలో సెకెండ్ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్‌ను అందజేశారు. విద్యాశాఖ చరిత్రలో సర్కార్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు తక్కువ రోజుల్లో పుస్తకాలు అందించడం ఇదే మొదటి సారని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఇది సరికొత్త రికార్డు అని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.



కర్నూలు మున్సిపల్ హైస్కూల్‌లో పుస్తకాలను అందజేస్తున్న డీఈఓ రంగారెడ్డి

ఒకే రోజున పంపిణీ చేశాం

ఉమ్మడి జిల్లాలో మొదటి సెమిస్టర్ కింద 39,66,794 పాఠ్యపుస్తకాలు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు అందించాం. సెకండ్ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు 12,05,227, వర్క్ బుక్స్‌ను ఒకే రోజున అన్ని స్కూళ్లలో పంపిణీ చేశాం. 1నుంచి 10వ తరగతి వరకు అన్ని టైటిల్స్ వచ్చాయి. – డాక్టర్ వి.రంగారెడ్డి, డీఈఓ

ప్రభుత్వాసుపత్రుల్లో విజిలెన్స్ తనిఖీలు



డాక్టర్ల సమక్షంలో ఆసుపత్రి రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ నాగరాజు యాదవ్

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐలు పి.టి.కేశవరెడ్డి, నాగరాజు యాదవ్, సునీల్ కుమార్, తహసీల్దార్ వెంకట నారాయణ, ఏజీ సిద్దయ్య, ఏఈ చంద్రశేఖర్, ఏవో రూఫస్ తదితరులు బృందాలుగా ఏర్పడి ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రి, పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నందికొట్కూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా, ల్యాబ్ రిపోర్టు సకాలంలో ఇస్తున్నారా? ఆసుపత్రిలో స్పెషలిస్టులు ఉన్నారా? ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉందా? ఆసుపత్రుల్లో ఖాళీలు ఉన్నాయా? పరిసరాల పరిశుభ్రత, రోగులకు ఆసుపత్రి సిబ్బంది అందిస్తున్న సేవలు తదితర అంశాలపై ఆరా తీశారు. పలువురు రోగులతో నేరుగా మాట్లాడారు. స్టాక్, అటెండెన్స్ రిజిస్టర్లతో పాటు ఆయా ఆసుపత్రులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నందికొట్కూరు ఆసుపత్రిలో స్టాక్ రిజిస్టర్‌లో ఉండాల్సిన మందుల కంటే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు సక్రమంగా ఉండటం లేదని, స్పెషలిస్టు డాక్టర్లు కూడా ఎవరూ అందుబాటులో ఉండటం లేదని పలువురు రోగులు విజిలెన్స్ అధికారుల దృష్టికి తెచ్చారు.



కలెక్టరేట్ వద్ద టీ తాగుతూ



చిన్నపార్కు రోడ్డులో చిరుతిళ్లు తింటూ

ముసురులో వేడి రుచులు

జల్లులు పడుతూ పోతూ..వారం రోజులుగా ముసురు పట్టి వాతావరణం చల్లగా మారింది. చలి గాలులు వీస్తుండటంతో ప్రజలు హాట్ హాట్‌గా ఉండే ఆహార పదార్థాలు తినేందుకు ఇష్ట పడుతున్నారు. వేడి వేడిగా తేనీరు తాగుతూ వెచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు. పల్లీలు నములుతూ, బాగా కాలిన మొక్కజొన్న పొత్తును తింటూ.. వెచ్చని అనుభూతి పొందుతున్నారు. చికెన్ పకోడి, నూడిల్స్, బజ్జీల బండ్ల వద్ద రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



పెద్దాసుపత్రి సమీపంలో మొక్కజొన్న పొత్తు కాల్చుతూ..



సీ క్యాంప్ సెంటర్‌లో నోరూరించే బజ్జీలు, వడలు, బోండాలు



ఓల్డ్ కంట్రోల్ రూం వద్ద సమోసా తయారు చేస్తూ..



బుధవార పేటలో పల్లీలు వేయిస్తూ..



మాధవనగర్‌లో సిద్ధంగా చికెన్ పకోడ

అవసరమైన ఖైదీలకు ఉచిత న్యాయ సేవ



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): అవసరమైన ఖైదీలకు ఉచిత న్యాయ సేవ అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీఎస్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన జిల్లా జైలును సందర్శించారు. ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి కల్పిస్తున్న సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. అనంతరం నగరంలోని మహిళా జైలును కూడా సందర్శించి అక్కడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్, డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ లీగల్ ఎయిడ్ ఎస్.మనోహర్ ఉన్నారు.

డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ సంచార పశువైద్య రథాలకు సంబంధించి (టోల్ ఫ్రీ నంబరు 1962) రెండు డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఈఎంఆర్‌ఐ–జీహెచ్‌ఎస్ జిల్లా మేనేజర్ ముస్తాక్ ఆలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణగిరి, ఆస్పరి ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి పదో తరగతి చదివిన వారు అర్హులని తెలిపారు. నెలకు రూ.10,800 వేతనంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయాలు ఉంటాయని పేర్కొన్నారు. నెలకు 4 సెలవులు ఉంటాయని, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాలకు 8125628308 నంబరుకు ఫోన్ చేయచ్చన్నారు.

మైనార్టీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్

కౌతాళం: మైనార్టీల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రమైన కౌతాళంలో పర్యటించారు. ఖాదర్ లింగస్వామి దర్గాను, కౌతాళంలోని మసీదులను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రామాల్లో మసీదులు, దర్గాలు, పీర్లచావిడిల గురించి ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మైనార్టీలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. హజ్ వెళ్లే వారి కోసం సబ్సిడీ రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే ఒక్కొక్కరికి రూ. 80వేలు చొప్పున భరిస్తోందన్నారు. ఖాదర్‌లింగస్వామి దర్గాను సందర్శించడంతో ఆయనకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఆదోని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ అగు బెస్త జయలక్ష్మి, భర్త బెస్త చిన్నస్వామి, ఇంటి నెం. 50-348-H23, K.P.N.R కాలనీ, బి-క్యాంప్ పోస్ట్, కర్నూలు సిటీ మరియు జిల్లా వారి తరుపున తెలియజేయడం ఏమనగా....

నా క్లయింట్ క్రింది షెడ్యూల్ దాఖల ప్లాటును బొహ్రా దలిచాండ్ శైలేష్ కుమార్ గారి నుండి తేది: 27-08-2021 (రిజిష్టరు తేది: 01-09-2021) నాడు రిజిష్టర్ డాక్యుమెంట్ నెం. 11741/2021 ద్వారా కొనుగోలు చేసినారు. సదరు బొహ్రా దలిచాండ్ శైలేష్ కుమార్ గారు షెడ్యూలు దాఖల ప్లాటును దలిచాండ్ ధరంచండ్ బొహ్రా అలియాస్ ధరంచండ్ ఘోరా గారి నుండి తేది: 18-08-2021 నాడు రిజిష్టర్ డాక్యుమెంట్ నెం. 11377/2021 ద్వారా దానం పొందినారు. సదరు ధరంచండ్ ఘోరా గారు పెరుగు వెంకట క్రిష్ణా రెడ్డి మరియు పెరుగు వెంకమ్మ గార్ల నుండి తేది: 02-07-1974 నాడు రిజిష్టరు డాక్యుమెంట్ నెం. 2504/1974 ద్వార కొనుగోలు చేసినారు. నా క్లయింట్ షెడ్యూలు దాఖల ప్లాటును బోహ్రా దలిచండ్ శైలేష్ కుమార్ ద్వార కొనుగోలు చేసినప్పుడు పైన తెలిపిన అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్స్ నాక్లయింట్‌కు ఇచ్చినారు. నా క్లయింట్ అగు బెస్త జయలక్ష్మి గారు తేది: 15-03-2023 నాడు కర్నూలు ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. బస్టాండు దగ్గర జిరాక్స్ సెంటర్‌కు పోవుచున్నప్పుడు మార్గ మధ్యంలో క్రింది షెడ్యూలు దాఖల ప్లాటుకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్ అనగా డాక్యుమెంట్ నెం. 2504/1974 తేది: 02-07-1974 పోయినది. సదరు డాక్యుమెంట్ గురించి కర్నూలు 4వ పట్టణ పోలీసు స్టేషన్ నందు కంప్లయింట్ ఇవ్వడం జరిగినది. సదరు 4వ పట్టణ పోలీస్ స్టేషన్ వారు తేది: 24-03-2023 నాడు సదరు డాక్యుమెంట్ ట్రేసవుట్ కాలేదు అని సర్టిఫికెట్ ఇచ్చినారు. ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 2504/1974 తేది: 02-07-1974 ఎవరికైనను దొరికినచో నన్ను గాని నా క్లయింట్‌ను గాని సంప్రదించగలరు. అట్టి వారికి తగిన పారితోషకం ఇవ్వబడునని తెలియజేయడమైనది.

షెడ్యూలు : కర్నూలు డి., కర్నూలు సబ్.డి., కర్నూలు మండలము, దిన్నెదేవరపాడు గ్రామ పంచాయితీ, దిన్నెదేవరపాడు గ్రామ సర్వే నెంబర్లు 108 & 109 ప్రస్తుతం సబ్ డివిజన్ సర్వే నెంబర్లు 108 & 109/1 ఈ సర్వే నెంబర్లుగల భూమినందు వేయబడిన ప్లాటును దిన్నెదేవరపాడు గ్రామ పంచాయితీ సర్పంచ్ వారిచే తేది: 24-12-1971న ఉత్తర్వుననుసరించి లే అవుట్ ప్లాటు ప్లాను మంజూరు కాబడినట్టి ప్లాట్ల పైకి ప్లాటు నెంబరు: 78 ప్లాటు స్థలమునకు చెక్కుబంది మరియు కొలతలు: **చెక్కుబంది : తూర్పు** : రోడ్డు, **పడమర** : ప్లాటు నెంబరు 73, **ఉత్తరం** : రోడ్డు, **దక్షిణం** : ప్లాటు నెం. 79 **ఈ నలుదిశలకు లోనైన ప్లాటునకు కొలతలు:** తూర్పు-పడమర: 50', ఉత్తరం - దక్షిణం: 35', ఈ ప్లాటు విస్తీర్ణం: 1750 చ.అ. లేక 194.44 చ.గ లు.

P.V. RAMANA REDDY, ADVOCATE, Kothapeta, Opp: District Court, Kurnool, Cell: 94402 05141

అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్టు

- రూ.3.60 లక్షల విలువ చేసే బంగారు నగలు రికవరీ



దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గజియాబాద్ జిల్లా సాయిబాబా నగర్‌లోని డీఎల్‌ఎఫ్ కాలనీకి చెందిన మహమ్మద్ సాజాద్ ఖాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ జిల్లా ఫతాదా తాలూకా ఖాలిద్‌పూర్ గ్రామానికి చెందిన కపిల్ జాటవ్‌లు కోడుమూరు రోడ్డులోని ఉల్చాల జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. వీరి నుంచి రూ.3.60 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ ఎదుట హాజరుపరిచారు. శనివారం సాయంత్రం నాల్గవ పట్టణ సీఐ శంకరయ్య, ఎస్‌ఐ మోహన్ కిషోర్‌రెడ్డితో కలసి డీఎస్పీ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

- కోడుమూరు రోడ్డులోని శ్రీనివాస నగర్‌లో ఫ్లాట్ నెం.15లో నాగలక్ష్మి నివాసముంటున్నారు. ఆమె కుటుంబ సభ్యులతో కలసి మే 4వ తేదీన ఇంటికి తాళం వేసి మంత్రాలయం వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు.
- రామలింగేశ్వర్ నగర్‌లోని అపార్ట్‌మెంట్‌లోని 4జీఏ బ్లాక్‌లో అబ్దుల్ లతీఫ్ నివాసముంటున్నాడు. జూన్ 21వ తేదీ ఇంటికి తాళం వేసి భార్యతో కలసి బంధువుల ఇంటికి వెళ్లగా దొంగలు తలుపులు బద్దలుకొట్టి ఇంట్లోకి ప్రవేశించి 10 తులాల బంగారు ఆభరణాలను మూటగట్టుకుని ఉడాయించారు.

బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పక్కా ఆధారాలతో ఉల్చాల జంక్షన్‌లో అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారన్నారు. దొంగలను అరెస్టు చేసి సొమ్ము రికవరీ చేసినందుకు సీఐ, ఎస్‌ఐలతో పాటు పోలీసు సిబ్బంది ఖాద్రి, షాకీర్ హుసేన్, శ్రీనివాసులు, కామ్లే నాయక్, శేఖర్, ఎల్లా శివుడు, కృష్ణ, సైబర్ ల్యాబ్ సిబ్బంది రాజేశ్వరరెడ్డి, చాంద్ బాషా, కృష్ణమూర్తి తదితరులను డీఎస్పీ అభినందించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

టీ తెచ్చిన తంటా..

- ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

డోన్ టౌన్: టీ స్టాల్‌లో టీ ఆర్డర్ ఆలస్యమైందని మొదలైన వాగ్వాదం చివరకు పోలీసు స్టేషన్‌కు చేరింది. ఈ ఘటన డోన్ పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐలు శరత్ కుమార్ రెడ్డి, నగేష్ తెలిపిన వివరాల మేరకు.. తారకరామనగర్‌కు చెందిన ఈశ్వర్‌గౌడ్, రమేష్ గౌడ్ సొంత అన్నదమ్ములు. వీరు స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో టీ స్టాల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. శనివారం అదే కాలనీకి చెందిన ఎరుకలి తిరుపతి అనే వ్యక్తి వచ్చి స్పెషల్ టీ కోసం ఆర్డరు ఇచ్చాడు. టీ ఇవ్వడం ఆలస్యం కావడంతో మాట మాట పెరగడంతో పరస్పరం దాడికి పాల్పడ్డారు. తిరుపతికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తనను కులం పేరుతో దూషించారని బాధితుడి ఫిర్యాదు మేరకు టీస్టాల్ నిర్వాహకులపై ఎస్సీ, ఎస్టీ కేసును, తమపై దాడి చేశాడని టీకొట్టు యజమానుల ఫిర్యాదు మేరకు తిరుపతిపై కౌంటర్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐలు తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్